క్లుప్తంగా

స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ హైమావతి

జంగారెడ్డిగూడెం రూరల్: మైసన్నగూడెం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ సింగుదాసు హైమావతి శనివారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈమని శశికుమార్, టీడీపీ నాయకుడు నూనె పల్లారావు, విద్యా కమిటీ ఉపాధ్యక్షుడు లింగగిరి సత్యవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే



కన్నాపురంలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న అంగన్‌వాడీ విద్యార్థులు

కొయ్యలగూడెం: కన్నాపురంలో శనివారం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సూపర్‌వైజర్ నయోమి రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఓ స్వర్ణకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ చదువు పూర్తిచేసిన విద్యార్థులందరూ బడిబాట పట్టాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శారద ప్రభావతి, మరియమ్మ, గంగారత్నం, వరలక్ష్మి పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సహాయం



దిప్పకాయలపాడులో ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సభ్యులు

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన యాతం నాగమణికి కొయ్యలగూడెం మానవత శాఖ శనివారం ఆర్థిక సహాయం అందజేసింది. రొమ్ము కేన్సర్‌తో బాధపడుతూ ఇంటి వద్దనే ఉండి చికిత్స పొందుతున్న ఆమెకు మానవత సంస్థ సభ్యులు రూ.3,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు బొమ్మ మోహన్‌రావు, మందపాటి రామకృష్ణ, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, గిద్దె మోహన్‌రావు, తిగిరిపల్లి చంటి, కాళింగి సత్యనారాయణ, ముప్పిడి వెంకట్రావు, ఏవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

లక్కవరంలో నేత్ర వైద్యశిబిరం



నేత్ర వైద్య శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విజయ ఆస్పత్రి వైద్యులు శిబిరానికి వచ్చిన ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు విజ్జు వెంకట స్వామి నాయుడు, బీజేపీ నాయకుడు విజ్జు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గురుకుల బాలికల పాఠశాలలో కీటక జనిత వ్యాధుల నివారణకు పిచికారీ చేస్తున్న దృశ్యం

చింతలపూడి: వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య సిబ్బంది సూచించారు. శనివారం నాగిరెడ్డిగూడెం గురుకుల బాలికల పాఠశాలలో కీటక జనిత వ్యాధుల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. అనారోగ్య సమస్య ఎదురైతే వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేసి అవసరమైన చికిత్సను తీసుకోవాలన్నారు. వర్షాకాలం వచ్చినందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పరస్పర కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: ఇరువర్గాల మధ్య తలెత్తిన ఘర్షణల నేపథ్యంలో పరస్పర కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం తమ మామగారి కార్యం నిమిత్తం కీడు బట్టల విషయమై శోభనాద్రిపురానికి చెందిన కుక్కల శైలజ, కఠారి వరలక్ష్మి కుటుంబాల మధ్య వివాదం తలెత్తింది. అది కాస్త ఘర్షణకు దారితీయడంతో ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించారు.

ఏరువాక పౌర్ణమి వేడుకలు

చింతలపూడి: జిల్లాలోని రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి డీపీఎం తాతారావు సూచించారు. చింతలపూడి మండలం, యండపల్లి గ్రామంలో అబ్దుల్ కలాం యూత్, జేడీ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో శనివారం ఏరువాక పున్నమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాడెద్దులు, నాగలికి పసుపు, కుంకుమలతో పూజలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీఎం తాతారావు మాట్లాడుతూ ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని పిలుపునిచ్చారు. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడిన పంటలను భుజించడం వలన అనేక అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అబ్దుల్ కలాం యూత్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరికంటి గోపాలకృష్ణ మాట్లాడుతూ వర్షరుతువులో జ్యేష్టశుద్ధ పౌర్ణిమను రైతులు ఏరువాక పున్నమిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ప్రతి ఏటా ఏరువాక పున్నమిని సంప్రదాయంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. రైతులు దేశీయ వరి విత్తనాలతో కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందులు లేని ఆహారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా 20 మంది రైతులను సత్కరించి నూతన వస్త్రాలను అందజేశారు. ప్రకృతి వ్యవసాయ అదనపు డీపీఎం మహబూబ్‌వలీ, జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.





చింతలపూడి: యండపల్లిలో కాడెద్దులు, నాగలికి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించిన దృశ్యం

కొయ్యలగూడెం: విశేష అలంకరణలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ అమ్మవారు →

కనకదుర్గమ్మకు విశేష పూజలు

కొయ్యలగూడెం: ఏరువాక పౌర్ణమి వేడుకలను శనివారం రైతులు, వ్యవసాయ అనుబంధ విభాగాల వారు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వై.జంక్షన్ ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని అర్చకులు బాణాల లక్ష్మణచార్యులు విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రైతులు అమ్మవారికి సామూహిక పూజలు జరిపారు. పండ్ల రసాలతో అమ్మవారిని అభిషేకించి ఆ తీర్థాలను తమ వ్యవసాయ క్షేత్రాలలో చల్లి అనంతరం పనులను ప్రారంభించారు. కొయ్యలగూడెం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో రైతు నాయకులు మద్దిబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో బలరామ పూజ నిర్వహించి రక్షాధారలను నాగళ్లకు కట్టి పనులను ప్రారంభించారు.

టీడీపీ దాడులు దుర్మార్గం



జెడ్పీటీసీ కడిమి రమేష్

కామవరపుకోట: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయ భవనాన్ని టీడీపీ ప్రభుత్వం కూల్చివేయడాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, జెడ్పీటీసీ కడిమి రమేష్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. మంచి పరిపాలన అందిస్తారనే ఉద్దేశంతో టీడీపీకి ప్రజలు అధికారం కట్టబెట్టారని, కానీ వారు అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ సీపీ శ్రేణులు, వారి కట్టడాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయటం దుర్మార్గమన్నారు. ఇలాంటి దాడులను ఉపేక్షించేది లేదని అన్నారు. తాడేపల్లిలోని కోర్టు అనుమతులతో నిర్మించిన వైఎస్సార్‌సీపీ భవనాన్ని కూల్చివేయటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం ఈ దాడులు ఆపని పక్షంలో రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు
- కామవరపుకోట మండలంలో పార్టీ శ్రేణులతో సమావేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కంభం విజయరాజు

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధైర్య పడవద్దని, సమన్వయంతో ధైర్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మండలంలోని కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ హామీలు ఇచ్చి 99 శాతం నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రతి ఇంట్లో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు కనపడుతుందన్నారు. ప్రజలు మరలా మనల్ని అధికారంలోకి తీసుకొస్తారని, కార్యకర్తలు అధైర్య పడొద్దన్నారు. రాజకీయంలో గెలుపు ఓటములు సహజమని, కార్యకర్తలు పార్టీ పటిష్టతకు సమష్టిగా రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలన్నారు. రానున్న రోజుల్లో ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను పరిష్కరించే దిశగా వారి పక్షాన నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు పొన్నాల అనిత, కేసరి సరిత రెడ్డి, సర్పంచ్‌లు కరిపోతు అనూష భాగ్యరాజ్, దేవరపల్లి రామ్మోహన్‌రావు, గుండుగోల సుబ్బారావు, ఎంపీటీసీలు కనుమూరు అంజిరెడ్డి, పోలిమెట్ల ప్రశాంత్, పార్టీ శ్రేణులు డాక్టర్ రామకృష్ణ, మేడూరు రంగబాబు, కేసరి శ్రీహరిరెడ్డి, షేక్ మీరా సాహెబ్, మేడంకి చిన్న, మేరుగు బాబురావు, గుర్రాల రవికుమార్, దాసిపండు తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు



శ్రీవేంకటేశ్వరస్వామికి హారతి ఇస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగ నివేదన, తీర్థప్రసాదాగోష్టి, అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని అష్టోత్తర పూజలు నిర్వహించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కనిగొళ్ల నాగవెంకట సురేస్, గద్దే సోమచంద్రచౌదరి, పి.హేమాన్ నందన్ అన్నప్రసాద వితరణ చేశారు. దాతలను ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, రుషికేష్, రాఘవ ఆచార్యులు వేదాశీర్వాదంతో సత్కరించారు. కార్యక్రమాలను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

నూకాలమ్మ ఆలయంలో చండీహోమం



ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని వేదపండితులు శ్రీరామ్ బ్రహ్మత్వంలో చండీహోమం నిర్వహించారు. శ్రీనూకాంబికా మహిళా భక్త బృందం ధ్వజస్తంభం వద్ద పాలపొంగళ్లు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీబాలా త్రిపురసుందరీ పీఠం ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కసుపర్తి లక్ష్మీ నరసింహ ధనకుమార్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. హరే శ్రీనివాస శ్రీఅభయాంజనేయ కోలాట భజన బృందం చింతామణి, తాడేపల్లి ఉమాదేవి ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు.

స్టూడెంట్ కిట్స్ రవాణా చార్జీలు హెచ్‌ఎంలకు చెల్లించాలి



ఎంఈవో–2 రాములుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

జంగారెడ్డిగూడెం: స్టూడెంట్ కిట్స్ రవాణా చార్జీలు ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు యూటీఎఫ్ జంగారెడ్డిగూడెం మండల శాఖ ఎంఈవో–2 జి.రాములు కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, షూ, సాక్స్, బెల్ట్‌లను ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్ పేరుతో అందజేయడం జరుగుతుందన్నారు. వీటిని పాఠశాలలకు సరఫరా చేయడానికి ప్రతి విద్యార్థికి సుమారు రూ.11 చొప్పున మొత్తం సుమారు రూ.77,000 రవాణా ఖర్చులు మండలానికి చెల్లించనుందన్నారు. ఈ నేపథ్యంలో ఎంఈవోల ఆదేశానుసారం మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సొంత ఖర్చులతో విద్యార్థుల కిట్స్‌ను పాఠశాలలకు తీసుకునివెళ్లడం జరిగిందన్నారు. అలా సొంత నిధులు వెచ్చించిన హెచ్‌ఎంలకు సంబంధిత రవాణా చార్జీలను ఆయా హెచ్‌ఎంల ఖాతాలో జమచేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీ శ్యాంబాబు, జిల్లా ఆడిట్ మెంబెర్ ఎంఏ నబీ, మండల బాధ్యుడు ఓ.తడహికో (అధ్యక్షుడు), టి.రామకృష్ణ (ప్రధాన కార్యదర్శి), ఏసురత్నం (ట్రెజరర్), వీఎస్ఆర్‌కే ప్రసాద్ (జిల్లా కౌన్సిల్ మెంబర్) పాల్గొన్నారు.

యంత్రాలను వ్యవసాయ పనులకే వినియోగించాలి

జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ పాష



చింతలపూడిలో సబ్సిడీపై ఇచ్చిన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ పాష

చింతలపూడి: ప్రభుత్వం రాయితీపై ఇచ్చిన యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు వ్యవసాయ పనులకు మాత్రమే వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ పాష ఆదేశించారు. చింతలపూడి సబ్ డివిజన్ పరిధిలో గతంలో కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ద్వారా సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీపై ఇచ్చిన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు ఆయా గ్రామాల్లో రైతులకు తక్కువ రుసుముకు అందుబాటులో ఉన్నాయా, లేవా అని రైతులను ఆరా తీశారు. రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన యంత్ర పరికరాలను ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు పొందిన రైతులు వారి వ్యవసాయ అవసరాల తరువాత గ్రామంలోని చిన్న, సన్నకారు రైతులకు మార్కెట్ కంటే తక్కువ రేటుకు అద్దెకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బి నాగకుమార్, మండల వ్యవసాయాధికారులు చింతలపూడి నుంచి కె మీనాకుమారి, లింగపాలెం నుంచి కె మురళీకృష్ణ, కె కోట నుంచి సీహెచ్ పవన్‌కుమార్, టి నరసాపురం నుంచి బి సుమలత, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో తనిఖీ

టి.నరసాపురం: రాయితీపై ప్రభుత్వం అందజేసిన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను వ్యవసాయ పనులకు మాత్రమే వినియోగించాలని, వీటిపై నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌కే హబీబ్ పాష అన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటించి చిన్న, సన్నకారు రైతులకు కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా రాయితీపై అందించిన యంత్ర పరికరాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందించిన యంత్రపరికరాలను వ్యవసాయ పనులకు వినియోగించిన అనంతరం గ్రామంలోని చిన్న, సన్నకారు రైతులకు మార్కెట్ రేటు కన్నా తక్కువ రేటుకు అద్దెకు ఇవ్వాలని రైతులకు సూచించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్, టి.నరసాపురం, చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట వ్యవసాయ అధికారులు బి.సుమలత, కె.మీనాకుమారి, కె.మురళీకృష్ణ, సీహెచ్ పవన్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారులు, వీఏఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: కుక్కునూరు మండలంలో సుమారు పది పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను మండల విద్యాశాఖ అధికారి గిరి భగవాన్ దాస్ ఆధ్వర్యంలో తొండిపాక పంచాయతీ సెక్రటరీ గౌరీ ప్రియ, హెచ్‌ఆర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ చెందిన హేమంత్ రాజు, ప్రవీణ్ కుమార్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనకబడిన బడుగు బలహీన వర్గాల పిల్లలను చదువులో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బెస్తగూడెం, గొమ్ముగూడెం, రెడ్డిగూడెం, బంజరగూడెం, ఉప్పేరు, గణపవరం, వెంకటాపురం, బండారిగూడెంలోని పలు పాఠశాలల్లో 3. 4 ,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధ గౌరీ, సరస్వతి, వెంకట్ నారాయణ, వినోద్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతంపై పీవో అసంతృప్తి



కేఆర్‌పురం గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన రెడ్డికోపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాలలో మొత్తం 138 మంది విద్యార్థులకుగాను కేవలం 58 మంది హాజరుకావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలు పునఃప్రారంభమై దాదాపు 10 రోజులు కావస్తున్నా తక్కువ సంఖ్యలో విద్యార్థులు హాజరుకావడంపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఇప్పటికైనా బడికి రాని విద్యార్థులు వెంటనే బడికి వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అదేవిధంగా బడిబయటి పిల్లలను, డ్రాప్ ఔట్ విద్యార్థులను గుర్తించి వారిని బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. కేఆర్‌పురం గురుకుల పాఠశాల, ఏపీఆర్‌జేసీ కళాశాలలను కూడా పీఓ సందర్శించి అక్కడి విద్యార్థుల సంఖ్యా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేఆర్ పురం ఐటీడీఏ డీవైఈఓ కె.సీలయ్య, ఏఎంఓ కె.శిరమయ్య, తదితరులు పాల్గొన్నారు.

టైలర్స్ అసోసియేషన్‌కి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: టైలర్స్ అసోసియేషన్ అభివృద్ధి నిమిత్తం కొయ్యలగూడేనికి చెందిన జేష్ట రామకృష్ణారావు రూ.50 వేల చెక్కును విరాళంగా శనివారం అసోసియేషన్ నాయకులకు అందజేశారు. విలియం హోం గణపతిరామ టైలర్స్ అసోసియేషన్ సంఘానికి ఈ మొత్తం అందించినట్లు తెలిపారు. టైలర్ సంఘ అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు, మట్టా సూర్యచంద్రం, ముప్పిడి చిన్నబాబు, మధుబాబు, టైలర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతపై తనిఖీ



రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విజయకృష్ణ

కామవరపుకోట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరుపై జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ శనివారం పరిశీలించారు. రావికంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాలను, వంటకాలను, మంచినీటి సదుపాయాలను తనిఖీ చేశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్న విద్యార్థుల సంఖ్యపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు చేరుకుని అక్కడి మధ్యాహ్న భోజన పథక అమలు తీరును పరిశీలించారు. పథకం అమలు తీరుపై, ఆహార నాణ్యత, రుచి, మెనూ అమలు, నీటి లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు విజయకృష్ణ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది యూనిఫాంలో లేకపోవటం, స్టాకు, రికార్డులు సరిగా నిర్వహించకపోవటంపై విజయకృష్ణ ఒకింత అసహనాన్ని వ్యక్తపరిచారు. సరిచేసుకోవాలని సిబ్బందికి సూచించారు.

శ్రీవారి సన్నిధిలో...



ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజుకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ పి.నటరాజారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

25న గణపతి హోమం

జంగారెడ్డిగూడెం రూరల్: ఈనెల 25న సంకటహర చతుర్థి సందర్భంగా గురవాయిగూడెం అయ్యప్పస్వామి క్షేత్రంలో ఉపాలయంలో కొలువైన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, గణపతి హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి శివారులో శనివారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై వి. చంద్రశేఖర్ తెలిపారు. ములగలంపల్లి శివారులో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ ఘటనలో 5గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.50,050 నగదు, 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యుద్ధప్రాతిపదికన నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని లక్ష్మీగణపతి టౌన్‌షిప్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. టౌన్‌షిప్‌లోని 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక కారణాలతో శనివారం సాయంత్రం కాలిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ ఈఈ(ఆపరేషన్స్) పి.రాధాకృష్ణ, ఏడీఈ యు.సుబ్బారావు ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. వెంటనే అక్కడ మరో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.